RNI NO.APTEL/2006/18110

ప్రతి అక్షరం... ప్రజల పక్షం....

# ప్రజాగళం

తెలుగు దినపత్రిక

నిజామాబాద్ సంపుటి : 20 సంచిక : 278 పబ్లిషర్ : కొక్కు రవికుమార్ మంగళవారం 25 - 8 - 2026 పేజీలు : 4 వెల : రూ. 1 - 00

## జార్ఖండ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో బిగ్ షాక్

ఢిల్లీ: జార్ఖండ్ ప్రభుత్వం సుప్రీంకోర్టులో బిగ్ షాక్ తగలింది. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన పరీక్షల్లో అవకతవకలపై సుప్రీం కోర్టు.. జార్ఖండ్ ప్రభుత్వం, తదితరులకు నోటీసులు జారీ చేసింది. అయితే ప్రస్తుతానికి దర్యాప్తుకు లేదా పరీక్ష రద్దుకు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవ్వలేదు. జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన సివిల్స్ ప్రిలిమ్స్-2025లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పరీక్షలో అక్రమాలపై సీబీఐతో స్వతంత్ర దర్యాప్తు జరిపించాలని కోరుతూ పిటిషన్ దాఖలైంది.

## సారంపల్లి మల్లారెడ్డి కన్నుమూత.. సీఎం రేవంత్ దిగ్భ్రాంతి

**హైదరాబాద్,ఆగస్టు 24:** రైతాంగ సమస్యలపై నిరంతరం పోరాడిన రైతు నాయకుడు, సీపీఐ(ఎం) నేతసారంపల్లి మల్లారెడ్డి (88) మరణిం చారని తెలిసి సీఎం ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.రైతుల హక్కులు, వ్యవసాయ సమస్యల పరిష్కారం కోసం ముందుండి అనేక ఉద్యమాలు నడిపించారని గుర్తుచేశారు. రైతు సంఘం నేతగా, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు.

## ఢిల్లీలో భారీ వర్షం...
# ప్రజాజీవనం అస్తవ్యస్థం

**న్యూఢిల్లీ,ఆగస్టు 24:**దేశ రాజధాని ఢిల్లీలోసోమవారం ఉదయం నుంచీ కురుస్తోన్న భారీ వర్షం.. జనజీవనాన్ని అస్తవ్యస్థం చేసింది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. కొన్నిచోట్ల ప్రధాన రహదారులపైకి కూడా నీరు చేరగా.. భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్ లో వెయిట్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. భారీ వర్షాల నేపథ్యంలో ఢిల్లీ ఎయిర్ పోర్టు నుంచి 15 ఫ్లైట్స్ ను దారి మళ్లించారు. రెండు ఇంటర్నేషనల్ ఫ్లైట్స్ సహా.. 15 విమానాలను జైపూర్ ఎయిర్ పోర్టుకు తరలించారు.

సౌత్ఈస్ట్ ఢిల్లీ, ఈస్ట్ ఢిల్లీ, సెంట్రల్ ఢిల్లీ, నార్త్ ఈస్ట్ ఢిల్లీ, సౌత్ ఢిల్లీ, న్యూఢిల్లీ,వెస్ట్ ఢిల్లీ, నార్త్ ఢిల్లీ, షాదర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. ఉదయం 8.30గంటల నుంచి 11.30 గంటలలోపు ఢిల్లీలో 28 మిల్లీ మీటర్లు,లోడి రోడ్ లో 24.6 మిల్లీ మీటర్ల



వర్షపాతం నమోదయింది. కొన్ని మెట్రోస్టేషన్లలోకి వర్షపు నీరు చేరగా.. ప్రయాణికులు ఆ వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేశారు.

## న్యూఢిల్లీ - పాట్నా విమానానికి తృటిలో తప్పిన ప్రమాదం



పాట్నా, ఆగస్టు 24: న్యూఢిల్లీ నుంచి పాట్నా బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానానికి తృటిలో ప్రమాదం తప్పింది. పాట్నాలోని జయప్రకాశ్ నారాయణ్ ఎయిర్పోర్టులో ల్యాండ్ అవుతున్న విమానాన్ని పక్షి ఢీకొట్టింది. ఈ అంశాన్ని ఎయిర్ పోర్ట్ అధికారుల దృష్టికి పైలట్ తీసుకెళ్లారు. దీంతో ఎయిర్ పోర్ట్లో ఫైర్, అత్యవసర సేవలను అధికారులు మోహరించారు. ఎయిర్పోర్ట్లో ల్యాండ్ అయిన ఈ విమానానికి సిబ్బంది తనిఖీలు నిర్వహించారు.రన్ వేపై దిగుతున్నప్పుడు విమానం కుడి వైపు ఇంజిన్ను పక్షి ఢీకొట్టినట్లు పరిశీలనలో తెలిందన్నారు. కానీ విమానం ఇంజిన్కు ఎటువంటి నష్టం జరగలేద న్నారు. ఈ సమయంలో విమానంలో 160 మంది ప్రయాణికులు ఉన్నారని వివరించారు. భద్రతా తనిఖీల అనంతరం ఈ విమానం ఢిల్లీకి దాదాపు గంటన్నర ఆలస్యంగా బయలుదేరిందని ఎయిర్ పోర్ట్ అధికారులు వివరించారు. మరో వైపు ఈ వారంలో పాట్నా ఎయిర్ పోర్ట్లో విమానాన్ని పక్షి ఢీకొట్టిన ఘటనల్లో ఇది రెండోదని తెలిపారు.

# రైతులే దేశానికి వెన్నెముక

## ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్

**అమరావతి,ఆగస్టు 24:**ఒక రైతు విజయాన్ని ఉదాహరణగా చూపుతూ తన అనుభవాన్ని పంచుకున్న వైనంఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక నిజమైన జాతీయవాది అని, అదే సమయంలో రాష్ట్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తారని భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ కొనియాడారు. ఆయన జాతీయవాదం రాష్ట్ర ప్రగతికి ఏమాత్రం అడ్డురాదని, ఇదే ఆయనలోని గొప్పతనమని ప్రశంసించారు. ఏలూరు జిల్లా ముసునూరులో జరిగిన నాన్-జీఎంఓ హై ఎక్స్పాన్షన్ పాప్కార్న్ హైబ్రిడ్ విత్తన ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా దక్షతపై ప్రశంసల జల్లు కురిపించారు. ముసునూరు గ్రామాన్ని ఒక విజయగాథగా తీర్చిదిద్దినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం తనకు వ్యక్తిగతంగా ఎంతో ప్రత్యేకమైందని, ఎందుకంటే ఇది భారతీయ రైతుల పురోగతికి సంబంధించినదని ఉపరాష్ట్రపతి అన్నారు. తన ప్రసంగంలో ఒక ఆసక్తికరమైన అనుభవాన్ని పంచుకున్నారు. “రెండు నెలల క్రితం ‘దినమలర్’ అనే తమిళ పత్రికలో మొక్కజొన్న పరిశ్రమలో పారిశ్రామికవేత్త పట్టాభి రామారావు సాధించిన అసాధారణ విజయాల గురించి చదివాను. ఒకే ఒక్క వ్యవసాయ ఉత్పత్తిని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన ఆయన స్ఫూర్తిదాయక ప్రస్థానం నన్ను ఎంతగానో




ఆకట్టుకుంది. వెంటనే ఆయనకు అభినందనలు తెలుపుతూ ఒక లేఖ రాశాను”అని వివరించారు. ఆతర్వాత పట్టాభిరామారావు తనను కలిసి పాప్కార్న్ను బహుకరించారని గుర్తుచేసుకున్నారు.

ఈ ఘటన తర్వాత జరిగిన ఒక యాదృచ్ఛిక సంఘటనను ఉపరాష్ట్రపతి సభతో పంచుకున్నా రు. కొద్దిరోజులకే ఉపరాష్ట్రపతి భవన్లో కేంద్ర వ్యవసాయ శాఖ మం త్రి శివరాజ్సింగ్ చౌహాన్తో సమావేశం జరిగిందని, ఆ సమావేశం లో పట్టాభి ఇచ్చిన పాప్కార్న్ను అందరికీ అందించానని తెలిపారు. ఒక భారతీయ రైతు వ్యవస్థాపక శక్తిని, ఆయన పండించిన ఉత్పత్తి సత్తాను చాటిచెప్పడానికే ఈ ఉదాహరణను చెబుతున్నానని రాధాకృష్ణన్ అన్నారు. రైతులే ఈ దేశానికి వెన్నెముక అని ఆయన పునరుద్ఘాటించా రు.

## రేవంత్తో భట్టి అత్యవసర భేటీ.. కొండా సురేఖ అంశంపైనే ప్రధాన చర్చ?

### - వివాదాల ప్రభావంపై నేతల సమీక్ష- తదుపరి చర్యలపై సమాలోచనలు-పాలన, శాఖల పనితీరుపైనా చర్చ

**హైదరాబాద్,ఆగస్టు 24:**తెలంగాణ రాజకీయాల్లో వరుస పరిణామాల వేళ ముఖ్యమంత్రి రేవంత్రెడ్డితో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అత్యవసరంగా సమావేశమయ్యారు. తాజా రాజకీయ పరిణామాలతో పాటు మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు, వాటి తర్వాత చోటుచేసుకున్న పరిణామాలపై ప్రధానంగా చర్చించినట్లు సమాచారం. కొన్ని రోజులుగా వివాదాస్పద అంశాలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారుతున్నాయి. ఈ వ్యవహారాలు కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠపై చూపుతున్న ప్రభావంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. కొండా సురేఖ అంశంలో ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సమాలోచనలు చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారానికి ఎలా ముగింపు పలకాలి? పార్టీపై ప్రభావం పడకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి? అనే అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పాలనాపరమైన అంశాలు, వివిధ శాఖల పనితీరుపైనా సమావేశంలో చర్చించినట్లు సమాచారం. రాబోయే రోజుల్లో ప్రభుత్వం అనుసరించాల్సిన




రాజకీయ వ్యూహంపైనా ఇరువురు నేతలు చర్చించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి భేటీకి ప్రాధాన్యం ఏర్పడటంతో కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. సమావేశం తర్వాత ఎలాంటి నిర్ణయాలు వెలువడతాయన్న దానిపై ఆసక్తి నెలకొంది.

# జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వకుండా
## 121 మద్యం బ్రాండ్లకు అనుమతా?: హరీశ్ రావు

**హైదరాబాద్,ఆగస్టు 24:** రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాత్రం ఉద్యోగ నోటిఫికేషన్లు విడుదల చేయడంలో మీనమేషాలు లెక్కిస్తూ 121 మద్యం బ్రాండ్ల నోటిఫికేషన్లు మాత్రం ఆఘమేఘాల మీద విడుదల చేస్తోందని మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శించారు. 121 రకాల మద్యం బ్రాండ్స్ కు నోటిఫికేషన్ ఇవ్వడంపై హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. యువత భవిష్యత్తుకు భరోసా ఇచ్చే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వని మీకు, మద్యం వ్యాపారానికి మాత్రం ఇంత తొందర ఎందుకు? అని ప్రభుత్వాన్ని నిలదీశారు.

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం కంటే మద్యం అమ్మకాలపైనే ప్రభుత్వానికి ఎక్కువ శ్రద్ధా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యువత డిగ్రీలు, పీజీలు పూర్తి చేసి, జాబ్స్ కోసం ఎదురు చూస్తుంటే, ప్రభుత్వం మద్యం షాపులు పెంచి, బ్రాండ్లు పెంచి, డబ్బు వసూలు చేయాలని చూస్తోందని ఆరోపిం చారు. టైమ్కు యువతకు ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వలేని ఈ చేతగాని సర్కారు.. మద్యం షాపులకు, బ్రాండ్లకు మాత్రం



నోటిఫికేషన్ ఇస్తున్నద న్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు, ఫీజు రీయింబర్స్ మెంట్ విషయంలో మోసం చేశారని, ఇకరాజీవ్యువ వికాసం.. వికసించక ముందే వాడిపోయిందని ఎద్దేవా చేశారు. రేవంత్ పగ.. యువత దగ అన్నట్లుగా తయారైందన్నారు. జాబ్ నోటిఫికేషన్లు నిల్.. లిక్కర్ నోటిఫికేషన్లు ఫుల్.. ఇదేనా రేవంత్ రెడ్డి మీరు చెప్పిన ప్రజా పాలన? అని ప్రశ్నించారు.

## పెద్దపల్లిలో ఉగ్ర లింకుల కలకలం.. ఎన్ఐఏ అదుపులో ఇంజినీరింగ్ విద్యార్థి

పెద్దపల్లి, ఆగస్టు 24: పెద్దపల్లి జిల్లాలోని రామగుండంలో ఉగ్ర లింకులు కలకలం రేపాయి. అయోధ్య నగర్లో నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ(ఎన్ఐఏ) తనిఖీల్లో ఈ విషయాలు బయటపడ్డాయి. ఈ క్రమంలో రామగుండానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి ముజామిల్ ఖాన్ను చీxూ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ముజామిల్ ఖాన్కు ఉగ్రవాద సంస్థలతో సం బంధాలు ఉన్నాయన్న అనుమానంతో అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం ముజామిల్ను ఎన్ఐఏ అధికారులు.. ఎన్టీపీసీ పోలీస్స్టేషన్కు తరలించి ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఉగ్రవాదులతో విద్యార్థికి ఎలాంటి లింకులు ఉన్నాయి, పరిచయాలు, ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు తదితర అంశాలపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు సమాచారం.మూడేళ్ల క్రితం కూడా కరీంనగర్లో ఉగ్రలింక్లు బయటపడిన విషయం తెలిసిందే. ఉగ్రవా



దులతో సంబంధాలు ఉన్నాయంటూ జగిత్యాలకు చెందిన వ్యక్తిని ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ వేగవంతం..
# రూ.250 కోట్ల నిధులు మంజూరు

### :మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్,ఆగస్టు 24:**గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే తన ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. చిగు రుమామిడి మండలం కొండాపూర్లో సోమవారం ‘పల్లె పల్లెకు పొన్నం అన్న--పల్లె పల్లెలో ప్రజా పాలన’ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. గ్రామాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణ ప్రక్రియ వేగంగా కొనసాగుతోందని మంత్రి తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.250 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. మూడు జిల్లాల కలెక్టర్లు భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించి ప్రక్రియను వేగవంతం చేస్తున్నారని చెప్పారు. కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. భూములు సేకరించిన వెంటనే అర్హులైన రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. ఆయిల్ఫామ్ సాగుతో అధిక లాభాలు పొందే అవకాశం ఉందని, రైతులు ఈ పంట సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. వర్షపు నీటిని భూగర్భ జలాలుగా ఒడిసి పట్టేందుకు ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మించుకోవాలని




సూచించారు. కొండాపూర్లో గుడిసెల్లో నివసిస్తున్న ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. గుడాల భాగ్య నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించనున్న మహిళా సంఘాల భవనానికి శంకుస్థాపన చేశారు. ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు హుస్నాబాద్ పట్టణంలో నిర్మితమవుతున్న 250 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ నాణ్యత, ప్రమాణాల పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

## విజయ్ సర్కార్ భారీ ప్రకటనలు..
# ఏడాదికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు

**చెన్నై,,ఆగస్టు 24:**తమిళనాడు అసెంబ్లీలో ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ సోమవారం పలు కీలక సంక్షేమ పథకాలను ప్రకటించారు. ఏడాదికి మూడు ఉచిత ఎల్పీజీ సిలిండర్లు అందించే పథకంతో పాటు ట్రాన్స్జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించనున్నట్లు తెలిపారు. ‘అన్నపూర్ణి సూపర్ సిక్స్’ పేరుతో గ్యాస్ సిలిండర్ల పథకం అమల్లోకి రానుంది. 2027 సంక్రాంతి నుంచి దీనిని ప్రారంభించనున్నారు. ఏటా రూ.2.5 లక్షల లోపు ఆదాయం ఉన్న కుటుంబాలకు ఈ ప్రయోజనం వర్తిస్తుంది. సుమారు 1.30 కోట్ల కుటుంబాలకు లబ్ధి చేకూరనుంది. అర్హులైన కుటుంబాలు కొనుగోలు చేసే మూడు గ్యాస్ సిలిండర్ల ఖర్చును నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. ఈ పథకానికి ఏటా సుమారు రూ.4,000 కోట్ల వ్యయం అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. గల్ఫ్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధ పరిస్థితులతో గ్యాస్ కొరత, ధరల పెరుగుదల కుటుంబాలపై అదనపు భారాన్ని మోపాయని విజయ్ తెలిపారు.

మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకం పరిధిని ప్రభుత్వం విస్తరించింది. ఇకపై సాధారణ బస్సులతో పాటు ఎక్స్ప్రెస్, ఎల్ఎస్ఎస్, డీలక్స్ బస్సుల్లోనూ మహిళలు ఉచితంగా ప్రయాణించవచ్చు. జిల్లాల మధ్య



నడిచే బస్సుల్లోనూ ఈ సదుపాయం కల్పించనున్నారు. ‘వెట్రి పయనం’ పేరుతో అక్టోబర్ 2నుంచి ఈ విస్తరణ అమల్లోకి వస్తుంది.

ట్రాన్స్జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించనున్నట్లు విజయ్ ప్రకటించారు. చెన్నై సమీపంలోని పరందూర్ విమానాశ్రయ ప్రాజెక్టుపై విజయ్ మరోసారి తన వ్యతిరేకతను స్పష్టం చేశారు. ప్రాజెక్టుతో ప్రభావితమయ్యే కుటుంబాల పక్షాన నిలుస్తామని చెప్పారు. ప్రత్యామ్నాయ ప్రాంతాలను ప్రభుత్వం పరిశీలిస్తోందన్నారు.

# సంపాదకీయం

## సార్వజనీన ఆరోగ్య సంరక్షణ

మెరుగైన భవిష్యత్తు ఉంటుందన్న ఆకాంక్షలు, మన చుట్టూ ఉన్న ప్రపంచంలో మెరుగైన జీవితాలు సాధ్యపడతాయన్న ఆశలు కలుగు తాయి. ప్రపంచ పర్యావరణంలో ప్రతికూల మార్పులు, సాయుధ ఘర్షణలు,వాణిజ్య యుద్ధాలు, పొంచిఉన్న అంటువ్యాధులు, తీవ్రత రమవుతున్న ఆర్థిక అసమానతలు, సంకుచిత దేశభక్తి మాటున చెలరేగుతున్న విద్వేషపు జాతి హననాలు, వర్ణ వివక్ష వంటి అనేక సమస్యలు, సంక్షోభాల నడుమ కూడా మన చుట్టూ ఉన్న ప్రపంచం శాంతి,సౌభాగ్యాలతో విలసిల్లుతుందన్న ఆశాభావం జనాల్లో నెలకొని ఉన్నది.ఆయురారోగ్యాలతో వర్థిల్లమని మనం దీవిస్తుంటాం. అయితే మన ఆరోగ్య రంగం పరిస్థితి ఎలా ఉంది? ప్రభుత్వ వైద్య సేవలు ఏమేరకు ఆశాజనకంగా ఉన్నాయి. అన్న ప్రశ్న అదే రంగంలో పనిచేస్తున్న నాకు ఎదురవుతుంది. కెనడా లోని అల్‌బెర్టా రాష్ట్రంలోని ఓ ఆసుపత్రిలోఎమర్జెన్సీ వైద్యం కోసం వచ్చి 8గంటలు వేచి చివరికి ప్రాణాలు కోల్పోయిన 44ఏళ్ళ భారతీయ మూలాలు కలిగిన వ్యక్తి విషాద కథనం మనం విన్నాం.మన దేశంలోనూ అలాంటి పరిస్థితు లే నెలకొని ఉన్నాయి. వైద్యుడు అందుబాటులోకి వచ్చే లోపే ప్రాణాలు కోల్పోతున్న పేషెంట్ల సంఖ్య తక్కువేమీ కాదు. ఇక డబ్బుగల వారికి జబ్బు చేసినా ప్రైవేటు ఆసుపత్రులలో ఎంత ఖర్చు చేసయినా తగిన వైద్యం పొందగలుగుతున్నారు. ఈ మధ్యనే ఒక బడా కార్పొరేట్ ఆసుపత్రి తన ఆదాయం ప్రతి రోగికి తలసరిన 9 శాతం పెరిగి సుమారుల డెబ్బై వేల రూపాయలకు పైగా గిట్టుబాటు అవుతున్నదని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరంలో రెండవ త్రైమాసిక ఆర్జన వివరాలు ఆ కార్పొరేట్ ఆసుపత్రిలో పెట్టుబడులు పెట్టిన వాటాదారులకు వీనుల విందుగా ఉండి ఉంటాయిగానీ మనకు తీవ్ర ఆందోళన కలిగిస్తాయి. ప్రజారోగ్య సంరక్షణ పట్ల నాకు ఉన్న అనురక్తి దృష్ట్యా×ప్రభుత్వం సార్వజనీన ప్రజారోగ్య సంరక్షణ కోసం కేవలం మాటలకే పరిమితమైతే సరిపోదనిపిస్తుంది. ఈ విశాల భూభాగంలో నివసించే ప్రతి పౌరుడికీ కావాల్సిన సకల వైద్య సేవలు సులువుగా అందుబాటులోకి తీసుకు రావడానికి ప్రభుత్వం సుదృడమైన కృషి చేపట్టాలి. ఆరోగ్యవంతమైన జనాభా దేశానికి ఎనలేని పెట్టుబడి అని ప్రభుత్వం గ్రహించాలి. అంతేగాక ఆరోగ్యాన్ని మానవ హక్కుగా పరిగణించాలి. ఆ హక్కును పరిపుష్టం చేసే నైతిక లక్ష్యంతో, భౌగోళిక, ఆర్థిక అడ్డంకులను అధిగమించి పౌరులందరికీ సార్వజనీన వైద్య సౌకర్యం కల్పించేలా ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేయడానికి ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించాలి. ప్రభుత్వం కల్పించాల్సిన ఆరోగ్య సేవలు విస్తృతంగా ఉండాలి. రోగ నివారణ, రోగ నిర్ధారణ, తగిన సమయంలో తగిన వైద్యం అందేలా చూడడం, అవసరమైన మేరకు ఆసుపత్రిలో సంరక్షణ కల్పించడం, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం గురించి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యడం వంటి అంశాలన్నీ నెరవేర్చాలి. కఠోర వాస్తవాలు: క్రియాశీల, సమత్వ, సహానుభూతితో కూడిన ఆర్థికంగా అందరికీ మెరుగైన×ఆరోగ్య వ్యవస్థను అందుబా టులోకి తీసుకురావడానికి ప్రాథమిక ఆరోగ్య సేవలను బలోపేతం చెయ్యడం మౌలికమైన అవసరమని గుర్తించాలి. ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆర్థికంగా, మానవ వనరుల పరంగా అత్యంత పటిష్టంగా ఇంటింటికీ వైద్య సేవలు, అందించేంత శక్తివంతంగా ఉండాలి. వీటిని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలుగా, విశాల వేదికగా మలచడం ద్వారా అనేకానేక మానవాభివృద్ధి కార్యక్రమాలకు వీటినే మందుపీఠిన ఉండేలా రూపొందించవచ్చు. అయితే ప్రాథమిక ఆరోగ్య సేవలు విడిగా మనజాలవు. కొంత మందికి మరింత మెరుగైన వైద్యం అవసరం పడుతుంది. తీవ్రమైన, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు తగిన వైద్యం అందించేలా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుబంధంగా సెకండరీ లేదా ప్రాంతీయ వైద్య సేవలు కూడా అందుబా టులోకి తీసుకురావాలి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' కేంద్రాలుగా పని చెయ్యాలి. అవసరమైన వారికి మెరుగైన, అధునాతన వైద్య సేవలు అందేలా చూడడంతో పాటు ఆసుపత్రి నుండి తిరిగి ఇంటికి వచ్చేశాక కూడా వైద్య పర్యవేక్షణ కొనసాగేలా చూడాలి. ఇదీ ఆదర్శవంతమైన ఆరోగ్య వ్యవస్థ నమూనా. కాని ప్రస్తుతం మన ఆరోగ్య వ్యవస్థ ఈ నమూనాకు అత్యంత దూరంలో ఉందనేది కఠోర వాస్తవం. మన దేశంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య సేవలు అస్తుబిస్తుగా ఉన్నాయి. గిరిజన గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సేవల అందుబాటు చాలా బలహీనంగా ఉన్నది. ఇక 'జాతీయ ఆరోగ్య కార్యక్రమం'లో తమ స్థానం ఏమిటో తెలియని అయోమయ స్థితిలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ఈ నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించే నిధులలో కోతలు పడుతున్నకొద్దీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ డోలాయమాన పరిస్థితులను ఎదుర్కొంటు న్నది. గత డిసెంబర్‌లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ప్రతి 2000 మంది జనాభాకు 'ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు' నెలకొల్పుతామంటూ చేసిన ప్రకటన మూలంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బలోపేతం అవుతాయనే ఆశ చిగురించే అవకాశముంది. వివిధ రా(ష్టాలలో ఇప్పటికే ఈ ఆరోగ్య మందిరాలను నెలకొల్పారుగానీ సెకండరీ/ప్రాంతీయ ఆరోగ్య కేంద్రాలతో వీటిని పూర్తి స్థాయిలో అనుసంధానం చెయ్యలేదు. అలాగే 'రిఫరల్ వ్యవస్థ కూడా చాలా బలహీనంగా ఉన్నది. ఇక ప్రభుత్వ ప్రాయోజిత హెల్త్ ఇన్సూరెన్స్ పథకం 'ప్రధానమంత్రి జన ఆయుష్ యోజన' (పిఎం.జె.ఎ.వై) ఆసుపత్రిలో 'ఇన్-పేషెంట్' ఖర్చులకు పూచీ పడుతుంది కానీ ప్రాథమికఆరోగ్య కేంద్రాలలో వైద్యసేవల ఖర్చులను 'కవర్' చేయడం లేదు. ప్రభుత్వ ప్రాయోజిత ఇన్సూరెన్స్ పథకాలేవీ 'అవుట్ పేషెంట్' చికిత్సకయ్యే ఖర్చులను భరించడం లేదు. వాస్తవానికి 'అవుట్ పేషెంట్' వైద్యానికి అయ్యే ఖర్చులో 60 నుండి 70 శాతం ఖర్చులు పరీక్షలు చేయించుకోవడానికి, మందులు కొనడానికే అవుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ప్రజలకు అవసరమైన తక్షణ వైద్య సేవలు అందించడంతో పాటు మెరుగైన వైద్య సౌకర్యం అవసరమైన వారిని మా త్రమే సెకండరీ/ప్రాంతీయ ఆసుపత్రుల కు 'రిఫర్' చేసే పటిష్ట వ్యవ స్థగా కూడా పనిచేయాలి. ఆరోగ్య సేవల ప్రైవేటీ కరణతో తలెత్తే సమస్యలు: మన దేశంలో ప్రైవేటు వైద్యరంగ విస్తృతి చాలా ఎక్కువ. కాబట్టి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 'రిఫరల్' వ్యవస్థగా క్రియాశీలంగా పని చేయడంలో కూడా ఇబ్బందులు తలెత్తవచ్చు. ప్రభుత్వ రంగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జిల్లా ఆసుపత్రి లేదా మెడికల్ కాలేజీ ఆసుపత్రిలోని స్పెషలిస్టు డాక్టర్ల నుండి టెలీ వైద్య సలహాలు, సేవలు పొందే వ్యవస్థను అభివృద్ధి చేయాలి.

పబ్లిషర్ : కొక్కురవికుమార్

# ఆశించిన స్థాయికి చేరని డిజిటల్ సేవలు..!



పంట ఉత్పాదకత పెరగడంలో, సాగు నిర్ణయాల్లో, స్థిరమైన వ్యవసాయ విధానాల అమలులో వ్యవసాయ సమాచారం కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, పాడి రైతులు ఇప్పటికీ ఎక్కువగా సాంప్రదాయ సమాచార వనరులపై ఆధారపడుతున్నారు. ఇటీవల తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జరిగిన ఒక అధ్యయనంలో పలు ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. వరి ఎగుమతి ప్రాంతాల్లో నిర్వహించిన పరిశోధనలో ఈ అంశాలువెలుగులోకి వచ్చాయి.వాతావరణ మార్పు లు, పురుగు నియంత్రణ, ఎరువుల వినియోగం, నీటి నిర్వహణ, మార్కెట్ ధరల వంటి కీలక విషయాల్లో రైతులు కుటుంబ సభ్యులు, స్నేహితులు, ఇరుగు పొరుగువారు వంటి వ్యక్తిగత వనరులపై ఎక్కువగా ఆధారపడుతున్నట్లు తేలింది. శాస్త్రీయ వ్యవసాయ సమాచార వనరులు, డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వినియోగం ఇంకా ఆశించిన స్థాయికి చేరలేదని అధ్యయనం స్పష్టం చేసింది.

**కుటుంబమే ప్రధాన సమాచారం వనరు..:** తెలంగాణలో 65 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 68.75 శాతం రైతులు కుటుంబ సభ్యులు, స్నేహి తుల నుంచే వ్యవసాయ సమాచారాన్ని ఎక్కువగా పొందుతున్నట్లు తేలింది. పొరుగువారి నుంచి సమాచారం పొందే శాతం కూడా గణనీయంగా ఉంది. అయితే ఈ విధానం వల్ల ఆధునిక "గుడ్ అగ్రికల్చరల్ ప్రాక్టీసెస్ (GAP)" గురించి అవగాహన తగ్గే అవకాశం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గ్రామీణ సహకార వ్యవస్థ బలంగా ఉన్నప్పటికీ, సమాచారం తరతరాలుగా పరిమిత వర్గాల్లోనే కొనసాగుతుందని అధ్యయనం పేర్కొంది.

**ప్రభుత్వ వ్యవసాయ అధికారులపై అధిక విశ్వాసం..:** సాంప్రదాయే తర వర్గాల్లో రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులపై రైతుల విశ్వాసం అత్యధికంగాఉన్నట్లుతేలింది.తెలంగాణలో 71.25శాతం, ఆంధ్రప్రదే శ్‌లో 73.75శాతం రైతులు వీరి ద్వారా సమాచారం పొందుతున్నారు.తెలంగాణలో రైతు వేదికల ద్వారా, ఆంధ్రప్రదేశ్‌లో రైతు భరోసా కేంద్రాల (RBKs) ద్వారా వ్యవసాయ సలహాలు చేరుతున్నప్పటికీ, కొన్ని గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా పూర్తి స్థాయి చేరిక లేనట్లు గుర్తించారు. శాస్త్రవేత్తలు, ICAR సంస్థలతో రైతుల ప్రత్యక్ష సంబంధం తక్కువగా ఉండడం కూడా ఒక ప్రధాన లోటుగా పరిశోధన పేర్కొంది. ఎన్జీవోల పాత్ర కూడా పరిమితంగానే ఉంది.

**మీడియా వినియోగంలో మార్పులు.. మొబైల్ పై ఆసక్తి... :** మాస్ మీడియా వర్గంలో కిసాన్ మేళాలు, వ్యవసాయ ప్రదర్శనలు రైతులకు ప్రధాన సమాచార వేదికలుగా నిలుస్తున్నాయి. ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం ఉండటంతో రైతులు వీటికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. న్యూస్‌పేపర్లు మోస్తరు స్థాయిలో వినియోగంలో ఉండగా, మొబైల్/ఇంటర్నెట్ ఆధారిత సేవలు పెరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఈ డిజిటల్ వినియోగం కొంత ఎక్కువగా కనిపిస్తోంది. టీవీ వినియో గం పరిమితంగాఉండగా, రేడియోపూర్తిగా దాదాపువి నియోగంలో లేకపో వడం గమనార్హం. ఇది సమాచార వినియోగంలో డిజిటల్ మరియు విజువల్ మీడియావైపు రైతులుమళ్లుతున్నసంకేతంగా కనబడుతోంది.

**మొత్తం వినియోగ ధోరణి..:** అధ్యయనంలో పాల్గొన్న రైతుల్లో ఎక్కువ మంది (సుమారు61.88శాతం) మధ్యస్థస్థాయి సమాచార వినియోగాన్ని చూపినట్లు తేలింది. తక్కువ స్థాయి వినియోగం 21.87 శాతం ఉండగా, అధిక స్థాయి వినియోగం 16.25 శాతంగా నమోదైంది.

**నిపుణుల అభిప్రాయం.. :** వ్యవసాయ సమాచార వ్యవస్థలో ప్రభుత్వ విస్తరణ సేవలు కీలకంగా ఉన్నప్పటికీ, పరిశోధనా సంస్థలు--రైతుల మధ్య దూరం తగ్గించాల్సిన అవసరంఉందని నిపుణులు సూచిస్తున్నారు. డిజిటల్ సేవలు, మొబైల్ యాప్స్ మరింత విస్తృతంగా చేరితే మాత్రమే ఆధునిక వ్యవసాయ పద్ధతుల స్వీకరణ పెరుగుతుందని అభిప్రాయపడుతున్నారు. పరిశోధన ప్రకారం, రైతులు ఇప్పటికీ కుటుంబం, స్నేహితులు వంటి సాంప్రదాయ వనరులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నప్పటికీ, ప్రభుత్వ వ్యవసాయ సేవలు మరియు డిజిటల్ ప్లాట్‌ఫార్మ్‌ల వైపు నెమ్మదిగా మార్పు కనిపిస్తోంది. అయితే ఈ మార్పు వేగం ఇంకా పెరగాల్సిన అవసరం ఉందని అధ్యయనం స్పష్టం చేసింది.


# అనవసర వివాదాలు..!

హైదరాబాద్, : మనదేశంలో ఎన్నో రాష్ట్రాలు ఉన్నాయి. కేంద్ర పాలిత ప్రాంతాలు కూడా ఉన్నాయి. వీటన్నింటికీ లేని గొప్ప నేపథ్యం తెలంగాణ రాష్ట్రానికి ఉంది. ఎందుకంటే మిగతా రాష్ట్రాలు ఎటువంటి ఉద్యమ నేపథ్యం లేకుండా ఏర్పడ్డాయి. తెలంగాణ రాష్ట్రం మాత్రం ఉద్యమాలు చేస్తే.. ప్రాణాలను తృణప్రాయంగా వదిలేస్తే వచ్చింది. ఆందోళనలు, నిరవధిక నిరాహార దీక్షలు, మిలియన్ మార్చ్ లు, వంటా వార్పు లు.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో చేస్తేనే తెలంగాణ సాకారమైంది.స్వీయ అస్తిత్వ కాంక్ష అనేది తెలంగాణ మట్టిలోనే ఉంది. అందుకే ఇక్కడ రాజకీయ చైతన్యం.. సామాజిక చైతన్యం.. ప్రజలలో ధిక్కారస్వభావం అధికంగా ఉంటాయి.. కాళోజి నారాయణ రావు..జయశంకర్.. పోటు కృష్ణమూర్తి.. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది ఉద్యమకారుల వారసత్వం తెలంగాణ లో ప్రతి ప్రాంతంలో కనిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ ఉద్యమం ఏర్పడేందు కు ప్రధాన కారణం ఆంధ్ర పాలకుల దోపిడి.. వివక్ష. వీటినుంచి తెలంగాణ తనను తాను కాపాడుకొనేందుకు అనేక రకాలుగా ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. ప్రాణాలు కూడా కోల్పోవాల్సి వచ్చింది. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇటువంటి వాతావరణం మళ్లీ కనిపిస్తుంటే ఇంతకంటే దారుణం మరొకటి ఏమి ఉంటుంది.నాడు తెలంగాణ ఉద్యమం తీవ్రంగా సాగుతున్నప్పుడు వైయస్ జగన్మోహన్ రెడ్డి రాకను తీవ్రంగా నిరసిస్తూ మహబూబాబాద్ లో తెలంగాణ ఉద్యమకారులు రాళ్ల దాడికి పాల్పడ్డారు. కానీ అటువంటి జగన్మోహన్ రెడ్డిని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రగతి భవన్ కు తోడుకొని వచ్చారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకానికి ముఖ్యఅతిథిగా ఆహ్వానిం చారు. జగన్మోహన్ రెడ్డి ప్రమాణ స్వీకారానికి కెసిఆర్ హాజరయ్యారు. అప్పట్లో చంద్రబాబుకు రిటర్న్ గిఫ్ట్ పేరుతో జగన్మోహన్ రెడ్డికి కెసిఆర్ సహాయం చేసినట్టు వార్తలు వచ్చాయి. అంతేకాదు రాయలసీ మ ను బంగారు తునక చేస్తానని.. తెలంగాణ నుంచి ఎంత నీటినైనా సరే ఇస్తానని కేసీఆర్ ప్రకటించారు.. అంతేకాదు పోతిరెడ్డిపాడు వెడల్పుకు సహకరించారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేసీఆర్ జమా నాలో ఆంధ్ర ప్రాంతానికి అనుకూలంగా చాలా జరిగాయి.. నాడు జాతీయ పార్టీ ఊహల్లో తేలియాడుతూ.. దేశానికి ప్రధానమంత్రి కావాలని ఆరాటంలో కేసీఆర్ చాలా చేశారు. చివరికి తనే కామా రెడ్డిలో ఓడిపోయారు.ఇప్పుడు ఇదే కేసీఆర్ సరికొత్త పల్లవిఅందుకున్నారు.. నాడు తెలంగాణ ఉద్యమంలో తాను కరీంనగర్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తే.. తన మీద కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని ఇప్పుడు భారత రాష్ట్ర సమితిలో చేర్చుకున్నారు. ఆయనకు ఏకంగా పార్టీ ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చారు. అంతేకాదు ఆయన ను గొప్ప నాయకుడిగా పేర్కొన్నారు. నాడు ఇదే ఎన్నికల్లో తనకు వైయస్ రాజశేఖర్ రెడ్డి మాత్రమే ముఖ్యమని.. తెలంగాణ ఉద్యమంతో ఏం సంబంధం అని జీవన్ రెడ్డి వ్యాఖ్యానించారు. నాడు తన మీద వ్యతిరేకంగా పోటీ చేసిన జీవన్ రెడ్డిని పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారనేది ఇక్కడ గమనించదగ్గ విషయం.రేవంత్ రెడ్డిని తెలం గాణ ఉద్యమకారుల మీదికి రైఫిల్ తీసుకుని వెళ్ళాడు.. ఉద్యమకా రులను తిట్టాడు.. ఆంధ్ర పార్టీలో పని చేశాడు.. అంటూ విమర్శిస్తున్న గులాబీ పార్టీ నేతలు.. జీవన్ రెడ్డి రాకను ఏ విధంగా సమర్థించు కుంటారో చెప్పాల్సి ఉంది.ఇక రేవంత్ రెడ్డి విషయానికి వస్తే.. నాడు ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమకారులకు సముచిత ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అతిగతి లేదు. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ గేయాన్ని రాష్ట్ర గేయంగా మార్చినప్పటికీ.. ఇంకా చేయాల్సిన పనులు చాలానే ఉన్నాయి. నాడు జీవన్ రెడ్డి పార్లమెంట్ సభ్యుడిగా పోటీలో ఉన్నప్పుడు ప్రచారం చేసింది రేవంత్ రెడ్డి. ఆయనను గొప్ప నాయకుడిగా పేర్కొంది కూడా రేవంత్ రెడ్డినే. ఇప్పుడు అదే రేవంత్ రెడ్డి జీవన్ రెడ్డిని విమర్శించారు. జీవన్ టోన్ అంటూ మండిపడ్డారు. అంతేకాదు జగిత్యాల నియోజకవర్గం లో భారత రాష్ట్ర సమితి గెలిచిన డాక్టర్ సంజయ్ కుమార్ ను గొప్ప నాయకుడిగా అభివర్ణిస్తున్నారు..వాస్తవానికి కెసిఆర్, రేవంత్ మాట్లాడుతున్న మాటలు తెలంగాణ ప్రజల్లో చర్చకు దారితీస్తున్నాయి. సోషల్ మీడియా ఇప్పుడు బలంగా ఉంది కాబట్టి గతంలో ఈ నాయకులు మాట్లాడిన మాటలను.. ఇప్పుడు మాట్లాడిన మాటలను ఒకసారి బేరీజు వేసుకుంటే అవసరాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. వారి పార్టీలో ఉన్నప్పుడు ఒక విధంగా.. పార్టీ నుంచి వెళ్లిపోయిన తర్వాత మరొక విధంగా మాట్లాడటం పట్ల ప్రజలు ఈసడించుకుంటున్నారు. చివరిగా జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినట్టు దళిత బంధు లక్ష కుటుంబాలకు రాలేదు. చివరికి స్టేషన్ ఘన్ పూర్ నాటి ఎమ్మెల్యే రాజయ్య దళిత బంధు పథకాన్ని తనకు అనుకూలంగా మార్చుకుంటే.. పత్రికలలో కథనాలు రావడంతో ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించాల్సి వచ్చింది. దీనిని బట్టి నాడు కేసీఆర్ అమలు చేసిన పథకాలు ఎంత గొప్పగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రేవంత్ రెడ్డి భూపాలపల్లి జిల్లా సభలో చెప్పినట్టు అందరి రైతుల వ్యవసాయ రుణాలు మాఫీ కాలేదు. కొందరి రైతులకు రైతు భరోసా డబ్బులు కూడా బ్యాంకులు ఇవ్వకుండా రుణాలలో మినహాయించుకున్నాయి.. ఏతావాతా చెప్పేది ఏంటంటే.. కెసిఆర్ కోరుకున్నట్టుగా బంగారు తెలంగాణ కాలేదు. రేవంత్ రెడ్డి చెబుతున్నట్టుగా రైజింగ్ తెలంగాణ ఏర్పడలేదు.

# దోబూచులాట..!

అదిలాబాద్: ఐదు నెలలుగా పెద్దపులి జనావాసాల వైపు తిరుగుతూ మరికొన్ని రోజులు అడవిబాట పడుతూ అటవీశాఖ అధికారులను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు అయితే తాగిస్తోంది.. అటవీమార్గంలోకి వెళ్లినట్లే వెళ్లి హమ్మయ్య అంటూ ఊపిరి పీల్చుకుంటున్న గంటల వ్యవధిలోనే జనావాసాల మధ్య పాద ముద్రలతో కనిపిస్తూ అజడి రేపుతోంది.. దీంతో ఉరుకులు పరుగులు పెట్టి అప్రమత్తం చేస్తున్న అటవీశాఖ అధికారులు ప్రజల నుంచి మాత్రం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్నారు. వీరు కావాలనే దీనితో కాలక్షేపంచేస్తున్నారని కొంత మంది అంటుంటే అది జనావాసాల వద్ద సునాయాశంగా దొరికే ఆవులకోసం వస్తుందని మరికొందరు అంటున్నారు.. మొత్తం మీద గడచిన అయిదు నెలలుగా మాత్రం పెద్దపులి తీవ్ర అలజడి అయితే సృష్టిస్తోంది. పోలవరం జిల్లా నుంచిగోదావరి దాటి తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి రాజానగరం నియోజకవర్గ పరిధిలోకి వచ్చే కోరుకొండ మండలంలోకి ప్రవేశించింది. అక్కడి నుంచి పాండవుల మెట్ట ప్రాంతంలో రెండురో జుల పాటు దాక్కున్న పెద్దపులి స్థానిక రైతులను తీవ్ర భయభ్రాం తులకు గురిచేసింది. పగటి పూట కొండప్రాంతంలో విశ్రాంతి తీసుకోవడం, రాత్రి వేళల్లో కొండ దిగి స్థానికంగా ఉండే పంటపొలా ల్లోకి చొరబడి అక్కడ ఉన్న పిల్ల కాలువల్లో దాహం తీర్చుకోవడం చేస్తుందంటున్నారు. పులికి ఏర్పాటు చేసిన ట్రాకింగ్ రేడియో కాలర్ ద్వారా పులికదలికలను గుర్తిస్తున్న అటవీశాఖ అధికారులు తాజాగా మునగాల కొండపై ఉన్నట్లు గుర్తించారు. ఇదిలా ఉంటే మళ్లీ తాజాగా మళ్లీ పెద్దపులి పోలవరం జిల్లాలోకి ప్రవేశించిందని తెలుస్తోంది. దేవీపట్నం మండలం కొత్తవీధి, బూరుగుబంద గ్రామాల మధ్య ఉన్న కొండపైన పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు.గత ఏడాది డిసెంబర్ నెలలో ఏలూరు జిల్లా బుట్టాయగూ డెం ఏజెన్సీ ప్రాంతంలో పెద్దపులి కదలికలను గుర్తించారు అటవీశాఖ అధికారులు.. ఏలూరుజిల్లాలో మూడు వారాలపాటు తీవ్ర అలజడి రేపిన పెద్దపులి పోలవరం జిల్లాలోకి ప్రవేశించింది. ఆతరువాత తూర్పుగోదావరి జిల్లాలోకి ప్రవేశించిన పెద్దపులి రాజమండ్రి రూరల్ ప్రాంతంలో తీవ్రఅలజడే రేపింది.వరుసగా రైతుల పొలాల్లోకి చొరబడి పశువులపై దాడిచేసి చంపేసిన పెద్దపులి అక్కడి నుంచి అప్పటి అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఉండే మండపేట నియోజకవర్గం రాయవరం మండలం కూర్మాపురం ప్రాంతంలో ఫిబ్రవరి 6వ తేదీన రాత్రి 7 గంటల ప్రాంతంలో ఎట్టకేలకు అటవీశాఖ అధికారులకు పట్టుబడింది.ఆ తరువాత విశాఖపట్నం పెద్దపులలు సంరక్షణ కేంద్రానికి తరలించి అక్కడ చికిత్స అందించిన అధికారులు ఫిబ్రవరి 14న పాపికొండల నేషనల్ పార్క్ పరిధిలోని అడవిలో వదిలిపెట్టారు.

వదిలినప్పటి డ్రోన్ వీడియోలను కూడా ఫారెస్ట్ అధికారులు విడుదల చేశారు. అయితే కేవలం వారం రోజుల వ్యవధిలోనే అల్లూరి సీతారా మరాజు జిల్లా పరిధిలోకి ప్రవేశించిన పెద్దపులి అక్కడి నుంచి పోలవ రం జిల్లా దేవీపట్నంపరిసర ప్రాంతాల్లోసంచరిం చిఆవులను చంపింది. అక్కడి నుంచి తూర్పుగోదావరి జిల్లాలోని మల్లవరం ప్రాంతంలో అలజడి రేపింది. అక్కడి నుంచి ఏలేరు రిజర్వాయరు వద్ద గోదావరిని ఈదుకుని కాకినాడ జిల్లాలోకి ప్రవేశించింది. జగ్గంపేట, ప్రత్తిపాడు నియోజకవర్గాల్లోని అటవీప్రాంతానికి ఆనుకునిఉన్న జనావాసాల వైపు వచ్చి తీవ్ర భయ భ్రాంతులను సృష్టించింది.



మళ్లీ పోలవరం జిల్లా వైపుగా వెళ్లి అడవిబాట పట్టింది..

తాజాగా పోలవరం జిల్లా నుంచి తూర్పుగోదావరి జిల్లాలోకి, అక్కడి నుంచి మళ్లీ పోలవరం జిల్లా పరిధిలోని దేవీపట్నం వైపుగా వెళ్లినట్లు దానికి అమర్చిన శాటిలైట్ రేడియో కాలర్ ద్వారా గుర్తించారు అధికారులు. పెద్దపులిని పట్టుకునేందుకు పూణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు తీవ్రంగా కృషిచేస్తున్నాయని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.

రాష్ట్రంలోని అటవీశాఖకు చెందిన హనుమాన్ బృందాలు, అటవీశాఖ సిబ్బంది నిరంతరం పెద్దపులిని బంధించేందు కు ప్రయత్నిస్తున్నారంటున్నారు. అయితే ట్రాంక్‌లైజింగ్ రెస్క్యూ టీమ్ పూణే నుంచి వచ్చినా పెద్దపులిని మాటు వేసి దానిని ట్రాంక్‌లైజ్ చేయాలని చేస్తున్న ప్రయత్నాలు బెడిసికొడుతున్నాయి.

# పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్య దారుణం

**- రక్షణ కల్పిస్తూ ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారిని ప్రతి జిల్లాలో నియమించాలి - నిజామాబాద్ నగరంలో ట్రస్మా నిరసన ర్యాలీ**

**నిజామాబాద్ సిటీ ఆగస్టు 24 (ప్రజాగళం)**నల్లగొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిసున్నామని ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షులు నిత్యానందంఅన్నారు. సోమవారం నిజామాబాద్ నగరంలో ట్రస్మా ఆధ్వర్యంలో కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ నిరసన ర్యాలీ నిర్వహించారు.తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల ఉపాధ్యాయుల భద్రతకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపి సాయి చైతన్య కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నల్లగొండ జిల్లాలో పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యకు గురైన సంఘటన విద్యా రంగాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. విద్యాసంస్థలను నిర్వహిస్తూ సమాజానికి సేవ చేస్తున్న ఒక మహిళా పాఠశాల నిర్వాహకురాలు ఇలాంటి దారుణ ఘటనకు గురికావడం అత్యంత బాధాకరమని తీవ్రంగా ఖండించదగిన విషయమన్నారు.పాఠశాల యాజమాన్యాలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు ప్రతిరోజు వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఇటువంటి ఘటనలు చోటుచేసుకోవడం వల్ల విద్యా రంగంలో పనిచేస్తున్న వారిలో భయాందోళనలకు గురి చేస్తున్నాయన్నారు.ఈ నేపథ్యంలో ట్రస్మా తరపున కొన్ని డిమాండ్లను సిపి దృష్టికి తీసుకువస్తున్నామన్నారు. రూపారెడ్డి హత్య కేసును అత్యంత ప్రాధాన్యతతో దర్యాప్తు చేసి, నిందితులపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కేసులో దర్యాప్తును వేగవంతం చేసి, నిజానిజాలను పూర్తిగా వెలికితీసి, బాధ్యులందరికీ కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలన్నారు.రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ , గుర్తింపు పొందిన పాఠశాలల కరస్పాండెంట్లు, యాజమాన్యాలు, ప్రిన్సిపాల్స్ ఉపాధ్యాయులకు భద్రత కల్పించేందుకు




ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల వద్ద, ముఖ్యంగా పాఠశాల యాజమాన్యాలు సిబ్బంది భద్రతకు అవసరమైన ప్రాంతాల్లో పోలీసు పర్యవేక్షణ, భద్రతా చర్యలను బలోపేతం చేయాలన్నారు. పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై బెదిరింపులు, దాడులు లేదా వేధింపులు జరిగినప్పుడు తక్షణమే స్పందించే ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారిని ప్రతి జిల్లాలో నియమించాలి. విద్యాసంస్థల యాజమాన్యాలపై లేదా సిబ్బందిపై వచ్చే ఫిర్యాదులను చట్టపరమైన విధానంలోనే పరిష్కరించేలా చర్యలు తీసుకుని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే చర్యలను అరికట్టాలన్నారు. పాఠశాలలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యాల మధ్య పరస్పర గౌరవం, క్షమశిక్షణ భద్రతను పెంపొందించేందుకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలనీ, ఇటువంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రైవేట్ పాఠశాలల భద్రతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, స్పష్టమైన భద్రతా మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి జీవిత భద్రత, గౌరవం వృత్తిపరమైన స్వేచ్ఛకు ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పిం చాలనీ, రూపారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున తగిన ఆర్థిక సహాయం అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిం చాలన్నారు.ఈ ఘటన ఒక్క కుటుంబానికి సంబంధించిన విషాదం మాత్రమే కాదనీ, విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రతి యాజమాన్యం, కరస్పాండెంట్, ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుని భద్రతకు సంబంధించిన తీవ్రమైన అంశమన్నారు. మా డిమాండ్లపై ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి, తగిన చర్యలు తీసుకోవాలని ట్రస్మా తరపున మనవి చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి జయసింహ గౌడ్, జిల్లా అధ్యక్షులు నిత్యానందం, జిల్లా సెక్రెటరీ అరుణ్, జిల్లా కోశాధికారి ఉప్పల మధు, నరసింహారావు, మోహన్, జనార్ధన్, పృద్వి, పాఠశాల శ్రీనివాస్, నాగరాజు, రమేష్, ప్రభాదేవి, కవితా, ధర్మరాజు, రమేష్, ఇతర కరస్పాండెంట్లు, ట్రస్మా పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు నిజామాబాద్ లో గవర్నర్ పర్యటన

**నిజామాబాద్ ఆగస్టు 24 ( ప్రజాగళం ప్రతినిధి )**రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ లో పర్యటించనున్నారు. దీనికి సంబంధించి అధికారిక షెడ్యూల్ ను ప్రకటించారు.ఉదయం 10.20 గంటలకు హెలికాప్టర్ల ో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దాన కిషోర్ తో కలిసి గవర్నర్ నిజామాబాద్ ఐడీఓసీ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు..ఉదయం 11 గంటలకు భూమారెడ్డి కన్వెన్షన్ సెంటర్‌లో యాంటీ డ్రగ్ అవగాహన కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు.మధ్యాహ్నం 12.15 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయానికి



గవర్నర్. పసుపు రైతులతో సమావేశం లో పాల్గొంటారు.మార్కెట్ లింకేజీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్న శివ ప్రతాప్ శుక్లా.మధ్యాహ్నం 1.50 గంటలకు పీహెచ్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ కార్యక్రమానికి హాజరు కానున్నారు. మధ్యాహ్నం 3.20 గంటలకు హెలికాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

# ప్రజావాణికి 103 ఫిర్యాదులు

**- అర్జీలను సత్వరమే పరిష్కరించాలి**



**నిజామాబాద్, ఆగస్టు 24 ( ప్రజాగళం ప్రతినిధి )** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 103 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ భుజంగరావు తో పాటు ట్రైనీ కలెక్టర్ సురేష్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీఆర్డీఓ సాయన్న, డీపీఓ శ్రీనివాస్ రావులకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ భుజంగరావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# అటవీశాఖ సిబ్బందికి నేర పరిశోధన , కేసుల దర్యాప్తుపై ఒక్కరోజు శిక్షణ

**- పోలీస్ కమీషనర్ సాయి చైతన్య వెల్లడి**



**నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 24( ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందికి నేర పరిశోధన , కేసుల దర్యాప్తు , కోర్టు విచారణలో సమర్థవంతమైన ప్రాసిక్యూషన్‌కు సంబంధించిన అంశాలపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం పోలీస్ కమీషనర్ కమాండ్ కంట్రోల్ హాల్ లో సోమవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అటవీశాఖ అధికారులు , సిబ్బందికి కేసుల దర్యాప్తును శాస్త్రీయంగా , సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పూర్తి చేయాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు.కేసు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ దశ నుంచి దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ దాఖలు చేసే వరకు ప్రతి దశలో సత్వర చర్యలు తీసుకోవడం , నేరానికి సంబంధించిన ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించడం , నిందితులపై నేరం రుజువయ్యేలా పక్కా ఆధారాలను సేకరించడం వంటి అంశాలను వివరించారు.అలాగే భారతీయ నాగరిక్ సురక్షా సంహిత 2023లోని దర్యాప్తు , సాక్షుల విచారణ , శోధనలు , కేసులను మేజిస్ట్రేట్‌కు పంపడం , దర్యాప్తు పూర్తయిన అనంతరం నివేదిక సమర్పించడం వంటి నిబంధనలను సమర్థవంతంగా అమలు చేసే విధానాలపై శిక్షణ ఇచ్చారు. బిఎన్ఎస్ఎస్ లో దర్యాప్తుకు సంబంధించిన సెక్షన్లు 176 నుంచి 193 వరకు , అలాగే సమన్లు , వారెంట్ల అమలుకు సంబంధించిన నిబంధనలు పొందుపరచబడ్డాయన్నారు.సాంకేతిక, శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యతపై కూడా ప్రత్యేకంగా వివరించారు. నేర స్థలంలో లభించే భౌతిక ఆధారాలు , డిజిటల్ ఆధారాలు , ఫోటోలు , వీడియోలు , సీసీటీవీ ఫుటేజీ తదితరాలను నిబంధనల ప్రకారం సేకరించి , వాటి సమగ్రతను కాపాడుతూ కేసు దర్యాప్తులో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.నేరానికి సంబంధించిన వస్తువులు , నమూనాలను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ కు నిబంధనల ప్రకారం సురక్షితంగా పంపించడం , సరైన ప్యాకింగ్ , లేబులింగ్ , సీల్ , డాక్యుమెంటేషన్ , చైన్ ఆఫ్ కస్టడీ వంటి అంశాల్లో జాగ్రత్తలు పాటించడం ద్వారా కోర్టులో సాక్ష్యాల విలువను కాపాడుకోవాలని వివరించారు.అదేవిధంగా కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో సాక్షులకు సమన్లు , నిందితులకు వారెంట్లు సకాలంలో అమలు చేయడం , వాటి అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేయడం, కోర్టు విచారణకు అవసరమైన సాక్షులను సమయానికి హాజరుపరచడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.కేసు నమోదు చేయడం మాత్రమే కాకుండా, నేరం కోర్టులో నిరూపితమై నిందితుడికి చట్ట ప్రకారం శిక్ష పడే విధంగా దర్యాప్తు నాణ్యతను పెంచుకోవడం ప్రతి



దర్యాప్తు అధికారికి ప్రధాన లక్ష్యం కావాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, సూచించారు.అటవీ నేరాలకు సంబంధించిన కేసుల్లో పోలీస్ , అటవీశాఖల మధ్య సమన్వయం , శాస్త్రీయ దర్యాప్తు , సాంకేతిక పరిజ్ఞానం వినియోగం , న్యాయపరమైన ప్రక్రియలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా కేసుల దర్యాప్తు మరింత పటిష్టంగా , వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఎఫ్ఐఆర్ నమోదు నుంచి చార్జిషీట్ దాఖలు, సాక్ష్యాల సేకరణ, ఎఫ్ ఎస్ ఎల్ నివేదికలు, కోర్టు ప్రక్రియలు, సమన్లు--వారెంట్ల అమలు తదితర అంశాలపై అటవీశాఖ సిబ్బందికి ప్రాయోగిక అవగాహన కల్పించారు.ఈ సమావేశంలో సి.సి.ఆర్.బి ఏసిపి బి. గురు నాయుడు , సి.సి.ఆర్.బి ఇన్స్పెక్టర్ ఆర్. అంజయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి , మల్లేశం , ఎస్. ఐ జె. వరప్రసాద్ రెడ్డి , ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రవి మోహన్ బట్ మరియు ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్స్ , ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఫతేపూర్ లో స్లాబ్ దశలోనే సచివాలయ భవన నిర్మాణం

**- మూడు ఏండ్లుగా కొనసాగని పనులు**

**- ప్రజాసేవ,పాలనకు ఆటంకం**

**ఆర్మూర్,ఆగస్టు 22 (ప్రజాగళం)** పాలకులు,ప్రజా ప్రతినిధులు మారిన ..ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు ..ప్రజా సేవకు,పాలనకు అసంపూర్తిగా ఉన్న గ్రామ పంచాయతీ భవనం.ప్రజాపాలన అసౌకర్యంగా మారిన గ్రామ పంచాయతీ భవనం. ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామంలో మూడేళ్లుగా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడం వల్ల స్థానిక పాలన,ప్రజా సేవలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.ఇందువలన పాలకవర్గం సమావేశాలు నిర్వహించడానికి,ప్రజలకు సేవలు అందించడానికి సరైన వసతి లేక ప్రత్యామ్నాయలపై ఆధారపడుతున్నారు. గ్రామ పంచాయతీ భవనం లేక మహిళా భవనాన్ని వాడుకుంటున్నారు.మహిళా భవనంలోనే గ్రామపంచాయతీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సేవలు,మహిళా సంఘ సమావేశాలు ఒకే భవనంలోనే నడుస్తున్నాయి.గ్రామపంచాయతీ కార్యాలయం లేక పంచాయతీ రికార్డుల భద్రతకు,అధికారుల రాకపోకలకు,ప్రజల సేవలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది.పాత గ్రామపంచాయతీ భవనాన్ని 2023వ సంవత్సరంలో కూల్చివేశారు.అదే సమయంలో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరైనాయి.సదరు కాంట్రాక్టర్ పిల్లర్లు,స్లాబ్ దశ వరకు నిర్మాణం జరిపాడు.మొత్తం 16 లక్షల రూపాయల్లో 11 లక్షల పైచిలుకు మొత్తానికి రికార్డులు చేయించి బిల్లులు తీసుకున్నాడు.మిగతా మొత్తం భవన నిర్మాణం పూర్తి కాకపోవడం,సదరు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మిగతా నిధులు ప్రభుత్వ ఖాతాకు తిరిగి వెళ్ళిపోయాయి.అసంపూర్తిగా



ఉన్న భవన నిర్మాణానికి గోడల నిర్మాణం,ప్లాస్టరింగ్ కు సుమారు రూ.10 లక్షల పైనే నిధులు మంజూరైతేనే నిర్మాణం పూర్తవుతుంది .సంబంధిత అధికారులు,జిల్లా కలెక్టర్ చొరవ చూపితే గ్రామపంచాయతీ భవనానికి నిధులు మంజూరు అవుతాయని గ్రామ ప్రజలు,సర్పంచ్ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**గ్రామపంచాయతీ భవనాన్ని పూర్తి చేస్తాం.**

ఏనుగు ప్రణుక నాగరాజ్.అసంపూర్తిగా గ్రామపంచాయతీ భవన నిర్మాణం ఉండడం వాస్తవమే.నిధుల కొరత,గత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం అసంపూర్తి భవనానికి కారణమన్నారు.సర్పంచ్ హోదాలో గ్రామ ప్రజలకు మేలు చేస్తాను.ఎమ్మెల్యే,జిల్లా కలెక్టర్,ఉన్నతాధికారులకు గ్రామ పాలకవర్గం,ప్రజలతో కలిసి వినతిని అందిస్తాం.స్థానిక ఎమ్మెల్యే,జిల్లా ఇంచార్జీ నాయకుల చొరవతో రూ.5 నుండి 10 లక్షలు మంజూరు చేయించి అసంపూర్తిగా ఉన్న భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తాం.

# గవర్నర్ పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, సీ.పీ.

**నిజామాబాద్, ఆగస్టు 24 ( ప్రజా గళం ప్రతినిధి)** రాష్ట్ర గవర్నర్ సి.శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. హైదరాబాద్ నుంచి బయలుదేరి ఉదయం 10.20 గంటల సమయంలో నిజామాబాద్ కు చేరుకోనున్నారు. రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం వద్ద జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు గవర్నర్ కు స్వాగతం పలుకుతారు. అక్కడి నుండి కట్టుదిట్టమైన బందోబస్తు మధ్యన కాన్వాయ్ ద్వారా ఉదయం 11.00 గంటలకు భూమారెడ్డి కన్వెన్షన్ హాల్ కు చేరుకుని, నషా ముక్త్ భారత్ అభియాన్ (యాంటీ డ్రగ్స్ అవగాహన) కార్యక్రమంలో గవర్నర్ పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.15 గంటలకు జాతీయ పసుపు బోర్డు కార్యాలయంలో సునహరీ మిట్టీ అభియాన్ కార్యక్రమంలో పాల్గొని పసుపు రైతులతో భేటీ అవుతారు. కార్యక్రమం ముగిసిన అనంతరం డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్-ధర్మారం శివారులోని పీహెచ్ఆర్ కన్వెన్షన్ లో అరవింద్ ధర్మపురి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో గవర్నర్ పాల్గొనున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. గవర్నర్ పర్యటించనున్న ప్రతీ చోట పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, సీ.పీలు సమావేశమై గవర్నర్ పర్యటన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. ప్రొటోకాల్ ను పాటిస్తూ గవర్నర్ పర్యటనకు ఎక్కడ కూడా ఏ దశలోనూ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని కలెక్టర్



సూచించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మెడికల్ టీం, 108, 104, ప్రత్యేక డాక్టర్ల బృందంను అందుబాటులో ఉంచాలని, వేదిక, సీటింగ్ ను సరి చూసుకోవాలని, తాగునీరు, శానిటేషన్ పక్కాగా ఉండాలని సంబంధిత అధికారులకు బాధ్యతలు పురమాయించారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, గవర్నర్ పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత ఉంటుందని, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని తెలిపారు. అనుమతి ఉన్న వారిని మాత్రమే గవర్నర్ కార్యక్రమాలకు హాజరయ్యేందుకు అనుమతిస్తామని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రైనీ ఆర్డీఓ సందీప్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


# ఎడపల్లిలో గుర్తుతెలియని వాహనం"ఢీ"కొని బర్రె మృతి....

**ఎడపల్లి,ఆగస్టు 24:(ప్రజా గళం)** ఎడపల్లి మండల కేంద్రంలో ని బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారిపై మేతకు వెళుతున్న బర్రెను సోమవారం ఉదయం గుర్తు తెలియని వాహనం"ఢీ"కొంది అని ఎడపల్లి ఎస్ఐ ముత్యాల రమ తెలిపారు.ఎస్ఐ తెలి పిన వివరాల ప్రకారం.. ఎడపల్లి గ్రామానికి చెందిన కంటేడి సంతోష్ పశు పోషకుడు చెందిన బర్రెలను ఈరోజు తీసుకెళుతుండగా నిజామాబాద్ నుండి బోధన్ వైపు అతి వేగంగా వెళుతున్న గుర్తుతెలియని మినీ వ్యాన్ ఢీకొంది.ఈ ఘటనలో బర్రెకు తీవ్ర గాయా లై అక్కడికక్కడే మృతి చెందినట్లు ఆమె తెలిపారు. మృతి చెందిన బర్రె సుమారు 60 వేల రూపాయలు ఉంటుందని బాధితుడు కంటేడి సంతోష్ తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమ తెలిపారు.



# పోలీస్ ప్రజావాణిలో 32 ఫిర్యాదులను స్వీకరించిన పోలీస్ కమిషనర్

**నిజామాబాద్ క్రైమ్ ఆగస్టు 24 ( ప్రజా గళం)**నిజామాబాద్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు.ఫిర్యాదు దారుల సమస్యలను విని వాటిని చట్టప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబందిత అధికారులకు పలు సూచనలు చేయడమైనది. సోమవారం నాడు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదు దారుల నుండి అర్జీలను స్వీకరించి వాటిని తక్షణ పరిష్కారం కోసం సంబంధిత పోలీస్ స్టేషన్ ల ఎస్.ఐ, సి.ఐ లకు ఫోన్ ద్వారా మాట్లాడి సమస్య స్థితిని, పరిష్కారానికి సూచనలు చేయడం జరిగింది.ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకుంటూ, వారి వారి సమస్యలు చట్ట ప్రకారం పరిష్కరించుకునేలా, పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి



భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలియజేశారు. ప్రజా సమస్యలు పై ఫిర్యాదులు నేరుగా స్వీకరిస్తూ ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం ద్వారా సమస్యలు పరిష్కారిస్తున్నామని సీపీ వెల్లడించారు.వివిధ ఫిర్యాదు లకు సంబందించిన 32 ఫిర్యాదు లను స్వీకరించారు.

# రాష్ట్రస్థాయి రోబ్ స్కిప్పింగ్ లో నిజామాబాద్ క్రీడాకారులు ప్రతిభకనబరిచారు

**- క్రీడాకారులను నిజామాబాద్ జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య అభినందించారు**

**- క్రీడాకారులకు మోడల్స్ అందజేశారు**




**నిజామాబాద్,ఆగస్ట్ 24,ప్రజాగళం:** హైదరాబాద్ నగరం లో జరిగిన ఒక్క రోజు రోబ్ స్కిప్పింగ్ టోర్నమెంట్ కు నిజామాబాద్ ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆర్కా ఇంటర్నేషనల్ చైర్మెన్ తీర్మల్ రెడ్డి,×=ాఖీ చైర్మెన్ షా గుప్తా అంజుం,రోబ్ స్కిప్పింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాంచారి శ్రీనివాస్,కార్యదర్శి కృష్ణం రాజు ఇందులో పాల్గొన్నారు.రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను బొబ్బిలి నర్సయ్య అభినందించారు.నీ4అంతటా శిక్షణ చేస్తూ ఉన్నత దిశగా ముందుకు సాగాలన్నారు.ఎంచుకున్న క్రీడా రంగం లో రాణించి జాతీయ అంతర్జాతీయ రంగాలలో రాణించి దేశానికి,పుట్టిన ఉరికి,శిక్షకులకు మంచి పేరు తేవాలన్నారు

# నిజాయితీ చాటుకున్న దేగాం సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డి



**ఆర్మూర్ ఆగస్టు 24 (ప్రజా గళం)** ఆలూర్ మండలం బేగం సర్పం చ్ ఇత్తడి లింగారెడ్డి నిజాయితీని చాటుకున్నాడు. మచ్చర్ల గ్రామానికి చెందిన సింధుల సుమన్‌కు చెందిన పర్సు ఆదివారం రాత్రి పోగొట్టుక న్నాడు. పర్సులో సుమారు ఐదు వేల నగదుతో పాటు ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లు ఉన్నాయి. పర్సు పోవడంతో సుమన్ ఆందోళనకు గురయ్యారు.ఈ క్రమంలో దేగాం సర్పంచ్ ఇట్టిడి లింగారెడ్డికి ఉదయం వాకింగ్ చేస్తుండగా పర్సు లభించగా, అందులోని వివరాల ఆధారంగా యజమాని సింధుల సుమన్‌ను గుర్తించారు. అనంతరం పర్సులో ఉన్న నగదు, డాక్యుమెంట్లతో సహా సుమన్‌కు సురక్షితంగా అప్పగించారు.ఈ సందర్భంగా సుమన్ సర్పంచ్ లింగారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పోగొట్టుకున్న పర్సును తన సొంత సొత్తుగా భావించకుండా, గుర్తించి తిరిగి అప్పగించడం ద్వారా సర్పంచ్ లింగారెడ్డి నిజాయితీ, మానవత్వాన్ని చాటుకున్నారని గ్రామస్థులు అభినందించారు.



# ఫీజు బకాయిలు విడుదల చేయాలని బీజేపీ నిరసన..

**బాన్సువాడ, ప్రజాగళం.** రాష్ట్ర ప్రభుత్వం గత కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు చేపట్టిన 48 గంటల నిరాహార దీక్షకు మద్దతుగా బాన్సువాడ పట్టణంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అంబేద్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొనాల గంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయకపోవడంతో దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బకాయిలు అందక చాలామంది విద్యార్థులు ఉన్నత విద్యను కొనసాగించలేక చదువులను మధ్యలోనే నిలిపివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి వారి చదువులు సజావుగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు చీదురు సాయిలు, జిల్లా కార్యదర్శి శంకర్‌గౌడ్, కౌన్సిలర్ గజ్జల మహేష్, పట్టణ ప్రధాన కార్యదర్శి చిరంజీవి ఉమేష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు తృప్తి ప్రసాద్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, బీజేపీ నాయకులు గురుకుల శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, చీకట్ల రాజు, పాశం భాస్కర్‌రెడ్డి, శ్యామల శ్రీకాంత్, కొండని గంగారం, పురుషోత్తం, సచిన్, సందీప్, మహేందర్, ఫణిందర్, భూమేష్, లక్ష్మణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆయుధాల ఉత్పత్తిపై అమెరికా కీలక సమావేశం!




ఇరాన్‌పై జరిగిన తాజా దాడుల అనంతరం తగ్గిన ఆయుధ నిల్వలను పునరుద్ధరించేందుకు అమెరికా ప్రభుత్వం కీలక చర్యలకు సిద్ధమవుతోంది. ఆయుధాల ఉత్పత్తిని వేగవంతం చేసే అంశంపై చర్చించడానికి ట్రంప్ పరిపాలన వైట్ హౌస్ లో అగ్రశ్రేణి రక్షణ కాంట్రాక్టర్ల ప్రతినిధులతో సమావేశం కానుందని రాయిటర్స్ వార్తా సంస్థ వెల్లడించింది.ఈ సమావేశానికి లాక్‌హీడ్ మార్టిన్ మరియు రేథియాన్‌తో వంటి ప్రధాన కంపెనీల కార్యనిర్వాహకులను ఆహ్వానించినట్లు సమాచారం. ఉ తయారీదారులను వేగంగా చర్యలు తీసుకునేలా ఒత్తిడి చేయడంపై ఈ చర్చలు కేంద్రీకృతమవుతాయని ప్రణాళికకు పరిచయమున్న వర్గాలు పేర్కొన్నాయి. అయితే,సోషల్ మీడియా వేదికలో చేసిన ఒక పోస్టులో మాజీ అధ్యక్షుడు ట్రంప్ అమెరికా వద్ద ఆయుధ సామగ్రి "వాస్తవంగా అపరిమితంగా ఉంది" అని, అవసరమైతే ఈ సామగ్రితో యుద్ధాలను "ఎప్పటికీ" విజయవంతంగా కొనసాగించగలమని వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో పెంటగాన్ నిల్వల పునరుద్ధరణ చర్యలు, రాజకీయ ప్రకటనల మధ్య వ్యత్యాసంపై చర్చ కొనసాగతోంది.

# చాట్‌జిపిటికి పెంటాగన్‌తో ఒప్పందం దెబ్బ..!


అమెరికా రక్షణ శాఖ (పెంటాగన్)తో ఓపెన్ ఎఐ కుదుర్చుకున్న వివాదాస్పద ఒప్పందంపై యూజర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్ తమఎఐ సాంకేతికతను సామూహిక నిఘాకు లేదా అటానమస్ ఆయుధాలకు ఉపయోగించకూడదని నిబంధన విధించడంతో పెంటాగన్ ఆ సంస్థను పక్కన పెట్టింది. ఆ వెంటనేచాట్‌జిపిటి మాతృసంస్థ ఓపెన్ ఎఐ రంగంలోకి దిగి ఈ ఒప్పందాన్ని సొంతం చేసుకోవడంపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీని ఫలితంగా అమెరికాలో చాట్‌జిపిటి యాప్ తొలగింపులు (అన్‌ఇన్‌స్టాల్) ఒక్కసారిగా 295 శాతం పెరగగా, వన్‌స్టార్ రేటింగ్‌లు 775 శాతం పెరిగాయి. ఎఐ సాంకేతికతను అమెరికన్లపై నిఘా పెట్టడానికి, యుద్ధాల్లో ఉపయోగించడానికి ఓపెన్ ఎఐ అంగీకరించడంతో నిరసన వ్యక్తం అవుతోంది. రక్షణ ఒప్పందాలకు దూరంగా ఉంటామని ప్రకటించిన ప్రత్యర్థి సంస్థ ఆంత్రోపిక్‌కి చెందిన క్లాడ్ యాప్ డౌన్‌లోడ్లు 88 శాతం పెరిగి, అమెరికా యాప్ స్టోర్‌లో నంబర్ వన్ స్థానానికి చేరుకుంది. పెంటాగన్ ఒప్పందం జరిగిన తీరు అస్తవ్యస్తంగా ఉందని అంగీకరించారు. ఆంత్రోపిక్‌తో పెంటాగన్‌కు విభేదాలు వచ్చిన వెంటనే ఈ ఒప్పందం చేసుకోవడం వల్ల యూజర్లకు తప్పుడు సంకేతాలు వెళ్లాయన్నారు.

# అలీబాబా క్వెన్ ఎఐ విభాగం అధిపతి రాజీనామా




చైనా టెక్ దిగ్గజం అలీబాబా గ్రూప్ కు చెందిన క్వెన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగం అధిపతి లిన్ జున్యాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. "బైనా ప్రియమైన క్వెన్," అనిఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్ లో సంక్షిప్తంగా పోస్టు చేశారు. అయితే ఆయన కారణాలను వెల్లడించలేదు. ఈ ఏడాది క్వెన్ విభాగాన్ని వీడిన మూడవ సీనియర్ అధికారి లిన్. క్వెన్ పోస్ట్-ట్రైనింగ్ విభాగానికి నాయకత్వం వహించిన యు బోవెన్ కూడా రాజీనామా చేసినట్లు చైనీస్ మీడియా సంస్థ లేట్‌పోస్ట్ తెలిపింది.జనవరిలో కోడింగ్ పరిశోధన శాస్త్రవేత్త హుయ్ బిన్యువాన్ నిష్క్రమించారు. నిష్క్రమణలపై స్పందించేందుకు అలీబాబా అధికారులు స్పందించలేదు. ఇదేసమయంలో హాంకాంగ్ మార్కెట్‌లో అలీబాబా షేర్లు 2.8% తగ్గిముగిశాయి. మధ్యాహ్న ట్రేడింగ్‌లో 4% వరకు పతనమయ్యాయి. ఇటీవల క్వెన్ నవీకరించిన ఉత్పత్తులను విడుదల చేసిన రెండు రోజులకే ఈ రాజీనామా చోటుచేసుకుంది. క్వెన్ మొబైల్ యాప్ నెలవారీ క్రియాశీల వినియోగదారులు జనవరిలో 31.05 మిలియన్ల నుంచిలో 203 మిలియన్లకు పెరిగినట్లు ఎఐసిపిబి వెల్లడించింది.

# ఈపీఎఫ్ఓ శుభవార్త.. 31 లక్షల మందికి బెనిఫిట్




ప్రైవేట్ రంగంలో ఉద్యోగుల ప్రయోజనాల కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గొప్ప సామాజిక భద్రతా పథకం ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్. దీనిని ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ నిర్వహిస్తోంది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఇది పని చేస్తుంది. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారని కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొచ్చారు. త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు.

ఈపీఎఫ్ఓవీక్లీ రివ్యూ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మాండవీయ వివరించారు. ప్రస్తుతానికి 31.86 లక్షల వరకు పీఎఫ్ ఖాతాలు.. నిర్వహణ లేవని (ఇనాపరేటివ్) ఈపీఎఫ్ఓ గుర్తించింది. దీంట్లో సుమారు రూ. 10,903 కోట్ల మేర నిల్వలు ఉన్నట్లు అంచనా వేస్తోంది. వీటిల్లో సుమారు 7.11 లక్షల ఖాతాల్లో రూ. 1000 వరకు మాత్రమే నగదు నిల్వలు ఉన్నట్లు పేర్కొంది. వీటి విలువ మొత్తంగా రూ. 30.52 కోట్లుగా ఉన్నాయి. లేబర్ మినిస్ట్రీ ప్రకారం.. ఈ నిర్వహణలో లేని పీఎఫ్ ఖాతాల్లో 20 ఏళ్లకు పైబడినవి కూడా ఉన్నాయి. దాదాపు మూడేళ్లుగా ఎలాంటి ట్రాన్సాక్షన్ నిర్వహించిన పీఎఫ్ అకౌంట్లను ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లుగా పేర్కొంటారు. ఇప్పుడు ఈపీఎఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం. ఈ కేంద్ర ప్రభుత్వ నిర్ణయంతో సుమారు 31 లక్షల మంది వరకు చందాదారులకు ప్రయోజనం దక్కనుంది. అయితే పైలట్ ప్రాజెక్టుగా చేపట్టే తొలి విడతలో సుమారు 7 లక్షల మంది వరకు ఈ ప్రయోజనాలు పొందుతారనికేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ చెప్పుకొ చ్చారు.

త్వరలోనే ఇది ప్రారంభించనున్నట్లు తెలిపారు.ఇప్పుడు ఈపీఎ ఫ్ఓ కు సంబంధించి.. లేబర్ మినిస్ట్రీ ఒక కీలక ప్రకటన చేసింది. ఇది ఒక రకంగా శుభవార్త. ఈపీఎఫ్ఓ ఇన్‌ఆపరేటివ్ అకౌంట్లకు సంబంధించి అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లను వారి వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్ చేయని వారి పీఎఫ్ ఖాతాల్లో పెద్ద మొత్తంలో నిధులు పోగుబడగా.. వీటిని చందాదారుల ఖాతాల్లోకే బదిలీ చేయాలని నిర్ణయించడం విశేషం.

# హాట్ టాపిక్ గా వైసీపీ నేతల ఆస్తులు!



విజయవాడ: గత పదేళ్ల కాలంలో ఎంపీల ఆస్తుల్లో జరిగిన మార్పులపై ఏడీఆర్ సంస్థ చేసిన తాజా అధ్యయనం దేశ రాజకీయాల్లో ఆసక్తికర చర్చకు దారి తీసింది. కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా 2014 నుంచి 2024 వరకు వరుసగా మూడు సార్లు గెలిచిన 102 మంది ఎంపీల ఆస్తుల వివరాలను ఈ సంస్థ విశ్లేషించింది. ఈ అధ్యయనంలో అత్యంత వేగంగా ఆస్తులు పెరిగిన ఎంపీల జాబితాలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు కీలక స్థానాల్లో నిలవడం విశేషంగా మారింది.టాప్ మూడు ఎంపీల్లో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే కావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అంతేకాదు, ఆ ఇద్దరూ ఒకే రాజకీయ పార్టీ అయిన వైసీపీకి చెందిన వారు కావడం మరింత ఆసక్తికర అంశం. రాజంపేట లోక్‌సభ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మిథున్ రెడ్డి ఆస్తులు పదేళ్లలో ఏకంగా 550 శాతం పెరిగినట్లు ఏడీఆర్ వెల్లడించింది.2014లో ఆయన ఆస్తులు సుమారు రూ.22 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.66 కోట్లకు చేరాయి. 2024లో ఇవి రూ.146 కోట్లకు పెరిగినట్లు అఫిడవిట్‌లో నమోదైంది. ఈ వేగవంతమైన పెరుగుదలతో దేశవ్యాప్తంగా అత్యధికంగా ఆస్తులు పెరిగిన ఎంపీల్లో ఆయన మూడో స్థానంలో నిలిచారు.ఇక కడప లోక్‌సభ నియోజకవర్గం ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఆస్తులు కూడా గణనీయంగా పెరిగాయి. 2014లో ఆయన ప్రకటించిన ఆస్తుల విలువ రూ.7 కోట్లుగా ఉండగా, 2019 నాటికి రూ.18 కోట్లకు చేరింది. 2024 ఎన్నికల సమయంలో ఇవి రూ.40 కోట్లుగా నమోదయ్యాయి. ఆస్తుల పెరుగుదల పరంగా చూస్తే ఆయన దేశంలో 15వ స్థానంలో నిలిచినట్లు ఏడీఆర్ నివేదిక పేర్కొంది.ఈ ఇద్దరిని మించి టాప్ స్థానంలో నిలిచిన ఎంపీ జార్ఖండ్‌కు చెందిన విజయ్ కుమార్ హన్సదక్ అని అధ్యయనం స్పష్టంచేసింది. జార్ఖండ్ ముక్తి మోర్చాపార్టీకి చెందిన ఈనేత రాజ్ మహల్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు

# అమర్ రాజా చుట్టూ రాజకీయం




**గుంటూరు** : తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గిగా కారిడార్‌లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థకు చెందిన అడ్వాన్స్‌డ్ కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ విజయవంతంగా ప్రారంభమవ్వడం పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. నాలుగు దశాబ్దాలుగా చిత్తూరు నేలను కేంద్రంగా చేసుకుని ఎదిగిన ఒక స్వదేశీ దిగ్గజ సంస్థ, ఏకంగా 9,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించే లిథియం-అయాన్ గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టును పొరుగు రాష్ట్రానికి తరలించాల్సి రావడంపై ఏపీలో రాజకీయం ప్రారంభమయింది. ఈ పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి జరిగిన తీరని లోటుగా అభివర్ణిస్తూ, తెలుగుదేశం పార్టీ గతాన్ని తవ్వి తీస్తూ వైఎస్సార్‌సీపీపై తీవ్రంగా విమర్శలు చేస్తోంది. ఈ ప్రారంభోత్సవం వెనువెంటనే ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన ప్రకటన ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థపై సాగిన రాజకీయ కక్షసాధింపు చర్యలు, వేధింపుల కారణంగానే రాష్ట్రం ఒక చారిత్రక పారిశ్రామిక అవకాశాన్ని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరరాజా ఛైర్మన్ గల్లా జయదేవ్ కుటుంబానికి ఏపీ సమాజం క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం తెచ్చిపెట్టిందని, నాటి జగన్ రెడ్డి సర్కార్ అవలంబించిన విధ్వంసకర విధానాలే ఈ ప్రాజెక్ట్ తెలంగాణ పాలమూరు రంగానికి వెళ్లడానికి కారణమని లోకేష్ తో పాటు టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా గ్రూప్‌ను రాజకీయ లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలుఉన్నాయి. గల్లా జయదేవ్ టీడీపీ ఎంపీగా ఉండటంతో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా ప్లాంట్ల మూసివేత నోటీసులు ఇవ్వడం, విద్యుత్ , నీటి సరఫరాను అడ్డుకోవడం, కేటాయించిన 253 ఎకరాల పారిశ్రామిక భూములను రద్దు చేసేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ తీవ్ర ఒత్తిళ్లు, అనిశ్చితి వాతావరణాన్ని తట్టుకోలేకనే అమరరాజా తన భవిష్యత్ విస్తరణ అయిన లిథియం-అయాన్ ఈవీ బ్యాటరీ క్లస్టర్‌ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని పారిశ్రామిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు.ఈ మొత్తం వ్యవహారంలో ఒకరి నష్టం మరొకరికి లాభంగా మారింది.

# తెలంగాణలో భారీగా నిరుద్యోగం..!




హైదరాబాద్,: ఇటీవల విడుదలైన గణాంకాల ప్రకారం తెలంగాణలో నిరుద్యోగ సమస్య ఆందోళనకరంగా మారింది. ప్రముఖ ఫైనాన్షియల్ సంస్థ బజాజ్ బ్రోకింగ్, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 'ఇండియన్ ఎకనామిక్ సర్వే 2025-26' ఆధారంగా ఒక నివేదికను వెల్లడించింది. దీని ప్రకారం ప్రస్తుతం తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.9 శాతానికి చేరుకొని దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది.దేశ సగటు నిరుద్యోగిత రేటు 5.2 శాతంగా ఉండగా, తెలంగాణలో అది అంతకంటే 3.7 శాతం ఎక్కువగా ఉంది. ఏపీ (8.2%), కర్ణాటక (8.0%) వంటి పొరుగు రాష్ట్రాల కంటే కూడా తెలంగాణలో నిరుద్యోగం అధికంగా నమోదైంది.2022లో బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ నిరుద్యోగిత రేటు కేవలం 0.7 శాతంగా ఉండేదని, అప్పట్లో ఉపాధి కల్పనలో రాష్ట్రం దక్షిణ భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని నివేదిక గుర్తు చేస్తోందిగత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున 2,037 ఉద్యోగ నియామకాలు జరగగా, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో గత రెండున్నరేళ్లలో ఆ వేగం తగ్గి నెలకు సగటున 566 నియామకాలకు పరిమితమైందని గణాంకాలు చెబుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగాలే కాకుండా, ప్రైవేట్ రంగంలోనూ ఆశించిన స్థాయిలో కొత్త అవకాశాలు రాకపోవడం, ఉన్నఉద్యోగాల్లో కోతలు నిరుద్యోగులను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.కొత్త ఉద్యోగనోటిఫికేషన్లు ఆశించిన స్థాయిలో రాకపోవ డం, జాబ్ క్యాలెండర్ అమలులో జాప్యం కారణంగానేరాష్ట్రంలో ఈ పరిస్థితులు నెలకొన్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

Printed, Published, and Owned by KOKKU RAVI KUMAR Editor: KOKKU RAVI KUMAR, Praja Galam Telugu Daily, C/O: Lazaras, Flat No: 206, 2nd Floor, Produturi Apartment, Road No: 11, Gangasthan Phase-2, Goopanpally, PO:Nizamabad Rs, DIST: Nizamabad, Telanagana-503003. Printed at: Swetha Offset printers, H. No: 2-10-91 & 92, Weekly Bazar, Boi gally, Nizamabad, Telanagan-503001 Email: info.krknews.ravi@gmail.com